# మోపెడ్ పిచ్చి

పగటి కలల్లో, ఏదో దాని మీద నిమగ్నమై ఉంటూ పరిసరాల్ని మర్చిపోయి ఉండటం, పుల్లారావు నోటినుంచి పది బూతులు తినడం రఘుకి కొత్తేమి కాదు.

ఆ పదహారు సంవత్సరాల వాడికి అమ్మాయిల గురించి కలలు కనే వయస్సు ఇంకా రాలేదు. కాని ఒక బలవత్తర ప్రేమ గట్టిగా పట్టుకుని ఉంది. అతని ప్రేమ భాజనం ఈ లోకంలో ఉండేది మాత్రం కాదు. అతని స్వప్నలోకానికి మాత్రమే పరిమితమైనది. అది ఈ లోకంలో అవతరించిన రోజే తన జీవితంలో ఒక మహత్తరమైన దినమని అతను అనుకుంటున్నాడు. ఆ అది అంటే ఏమిటి? వేరే ఏమి కాదు. వట్టి ఒక మోపెడ్ .

పుల్లారావ్ గారి ఆ చిన్న వర్క్‌షాప్‌లో అతనికి సహాయంగా రఘు అనే అబ్బాయి మాత్రమే ఉన్నాడు. ఏడో తరగతి వరకు చదివి 14వ సంవత్సరంలో కూడా 8వ తరగతి దగ్గరకు కూడా చేరలేని రఘు స్కూలుకే స్వస్తి చెప్పాల్సి వచ్చింది. తర్వాత ఒక నామధేయప్రాప్తికి కావాల్సిన ప్రాయంగాని, అర్హతగాని లేని ఈ వర్క్‌షాప్‌లో అతను ఒక పనివాడిగ చేరాడు. పుల్లారావు సమర్థుడైన మెకానిక్. అతను ఏవేవో వర్క్‌షాప్‌లలో పనిచేసి అనుభవం గడించాడు తప్ప ఇంజనీరింగ్ కాలేజీలోగాని, పాలిటెక్నిక్ కాలేజీ నుంచి గాని డిగ్రీ, డిప్లొమో సంపాదించిన వ్యక్తి కాదు. స్వంతంగా అతను ఆ వర్క్‌షాప్ పెట్టి కొన్ని సంవత్సరాలు అయినా చెప్పుకోదగిన అభివృద్ధి ఏమి కాలేదు. దానిమీద వచ్చే ఆదాయం వృద్ధాప్యంలో వున్న తల్లిదండ్రులకు, భార్య, పిల్లల పోషణకు ఖర్చయిపోతుంది. లభించే ఆదాయంలో ఏదైనా నిలువ ఉంటే కదా సంస్థ అభివృద్ధి చెందేది. ఏది ఏమైనా గత రెండు సంవత్సరాల నుండి తన సంస్థలో తన క్రింద ఒక పనివాడు ఉండడంతో పుల్లారావులో పుట్టిన గర్వం అంతా ఇంతా కాదు. తన పరిపాలనకు శ్రీకారం చుట్టే ఈ కాలంలో తన పరిపాలన క్రింద ఉండే ఏకైకుడైన రఘును పరిపాలించే విషయంలో పుల్లారావు తన పరిపాలనా ప్రతిభను ఎప్పుడూ ప్రదర్శిస్తూ ఉంటాడు. మధ్యలో ఈ రఘుకు కలలు రావడం!!

పగటి సమయంలో చాలాసార్లు ఈ రఘును లేపి తిట్టడంతో పుల్లారావుకు విసుగుపుట్టి అసలు అతను ఎలాంటి కలలు కంటున్నాడో కనుక్కుందామని ఆలోచించాడు. ఎందుకంటే చాలా చక్కగా పనిచేస్తున్న వేళల్లో అకస్మాత్తుగా స్వప్న లోకానికి జారుకుంటాడు. అదికూడా రెండు మూడు నిమిషాలపాటు మాత్రమే. పనిలో అతనికుండే త్రికరణశుద్ధి, ఆసక్తి మరియు ఉత్సాహాన్ని పుల్లారావు ఎప్పుడూ సంతోషంగా గుర్తిస్తూనే ఉంటాడు. స్కూటర్ గాని, మోపెడ్ గాని తళతళ మెరిపించడంలో అతను చూపించే శ్రద్ధ ఘననీయమే. తమ వద్దకు వస్తున్న ఏదైనా ఒక శకటాన్ని

నిమురుతూ, నిమురుతూ అప్పుడప్పుడు దానిని ముద్దు కూడా పెడుతుంటాడు. రఘు చేసే పనిలో పుల్లారావుకు పూర్తి సంతృప్తి ఉన్నా అప్పు డప్పుడూ తిట్టకపోతే తన పరిపాలనా సామర్థ్యంలో లోపం ఏర్పడుతుందనే న్యాయమైన అనుమానం వస్తుంటుంది. ఏది ఏమైనా ఈ చిన్నవాడు ఎందుకు పగటి కలలు కంటున్నాడో అడిగేయాలని పుల్లారావు నిశ్చయించుకున్నాడు.

''ఏరా రఘు ఏమిటా పగటి కలలు? ఇంకా బొడ్డూడలేదు. అప్పుడే సరస శృంగారాలు మొదలు పెట్టావా?''

ఛ... ఛ... అలాంటిదేం లేదన్నా అని కొంచెం సిగ్గుతో, భయంతో రఘు సమాధానమిచ్చాడు.

మరి నీవు దేని గురించి ఆలోచిస్తున్నావు?

అలాగ రఘుకు తన అంతరంగలో ఉండే-అత్యాశ గురించి పుల్లారావుతో తడబ డుతూ తడబడుతూ చెప్పాల్సి వచ్చింది. స్కూటర్, మోపెడ్ లాంటి శకటాలను రిపేర్ చేయడంలో కొంత నైపుణ్యం సంపాదించ గలిగినా రఘుకు ఆ వాహనాలను ట్రైల్ కొరకు బయటికి తీసుకుపోవడానికి అవకాశం దొరుకుతున్నా సొంత ఇంటికి తీసుకుపోవడానికి గాని, సాయంత్రం వేళల్లో షికారుకు పోవడానికి గాన అవకాశం ఎప్పుడైనా వస్తుందని నమ్మకం మాత్రం ఉండేది. అందుకే అతని అత్యాశ రోజు రోజుకు పెరుగుతూనే వచ్చింది.

ఒక సుదీర్ఘ ఆలోచనాంతరం పుల్లారావు ఒక అద్భుతమైన పథకాన్ని రఘు ముందు ప్రవేశ పెట్టాడు. తదనుసారంగా అతను మోపెడ్ భాగాలను ఒకటి, ఒకటిగా తీసుకురావడం మొదలుపెట్టాడు. చేతిలొ కొన్ని టూల్స్‌తో తిరుగుతన్న రఘుకు అవకాశం దొరకగానే పార్క్ చేసి వున్న మోపెడ్స్ నుంచి కొన్ని భాగాలు తెచ్చి పుల్లారావు సమక్షంలో పెట్టేటప్పుడు తన జీవితంలో ఎంతో గొప్పదైన ఒక పనిని తాను ముగించానని మరియు తన సుదీర్ఘ కోర్కె ఇంకా కొద్ది రోజుల్లో నెరవేరబోతోం దని సంతోషపడ్డాడు. కాని ఆ తరుణంలో పుల్లారావు తన పథకంలో ఒక కొత్త పుల్లవేశాడు. మెపెడ్ భాగాలన్నీ కలిపి ఒక కొత్త వాహనాన్ని తయారు చేయొచ్చు. కాని దాన్ని రిజిస్టర్ చేసేదెలా? నంబర్ లేని ఒక వాహనం వాడితే పట్టుబడుతుంది. వాళ్ళిద్దరూ లోపలికి పోతారు. అందుకే రఘు ఇప్పుడు చేస్తున్న చిన్నా చితకా దొంగతనాలు మరికొన్ని రోజులు, సాగిస్తే ఒక క్రొత్త మోపెడ్ లేక ఒక సెకండ్ హ్యాండ్ మోపెడ్ కొనేయడం తేలికవుతుందని పుల్లారావు అభిప్రాయపడ్డాడు. రఘుకు కూడా అది సరైందేనని అనిపించింది.

రఘు చేసే దొంగతనాల పరంపర అలాగే సాగింది. దాంతో పుల్లారావు ఇంటి పరిస్థితులు కూడా ఇంకా, ఇంకా మెరగవుతూ వచ్చాయి. చివరకు జరగాల్సిందేదో

జరిగిపోయింది. రఘు పట్టుబట్టాడు. దొంగిలించిన వస్తువులతో అతన్ని పట్టుకున్న వాళ్ళు, చితకబాది పోలీసులకు అప్పగించారు. అక్కడ ఇంటారాగేషన్ మొదలయింది. స్కూటర్, మోపెడ్ దొంగతనాల కేసులలో ఇతన్ని ఎంత మేరకు ఇరికించవచ్చున్నది ఎస్.ఐ.గారి ప్రయత్నం. ఎంత కొడితే కూడా ఒక వాహనాన్ని కూడా తాను దొంగలించానని ఒప్పుకోలేదు. కాని మోపెడ్ భాగాలు ఏవేవి, ఎక్కడెక్కడ తాను దొంగిలించినవి మాత్రం చెబుతూ వచ్చాడు. రెండురోజుల తర్వాత పోలీసాఫీసర్‌కు ఆ కుర్రవాడి పైన కొద్దిగా సానుభూతి కలగడం వల్ల అతని సరైన కథ వినడానికి ఓపిక కూడా ఏర్పడింది.

దాంతో ఆ ఆఫీసర్‌కు రఘుపైన కలిగిన సానుభూతి పదిరెట్లు పెరిగింది. ఆ చిన్నబ్బాయిని ఈ దారిలోకి తెచ్చిన పుల్లారావును నమిలి వేయాలనేంత కోపం కూడా వచ్చింది. పుల్లారావును చితకబాదేటప్పుడు ఆ సబ్ ఇన్స్పెక్టర్ కాళ్ళు పట్టుకుని తన యజమాని ప్రాణభిక్ష యాచించి ఆ కుర్రవాడు ఏడ్చాడు.

మంచివాడైన ఆ పోలీసాఫీసర్ రఘును ఒదలి పెట్టాడని, మాత్రంకాదు, ఒక మంచి వర్క్‌షాప్‌లో ఒక మోస్తరు జీతభత్యంతో పని ఇప్పించాడు కూడా. కాని ఆ పోలీసాఫీసర్‌ను దేవునితో సమానంగా పూజించాలని రఘుకు అన్పించిందంటే దానికి కారణం వేరే ఉంది. ఆ కొత్త వర్క్‌షాప్ యజమానితో చెప్పి రఘుకు వాయిదా పద్ధతి ఒక కొత్త మోపెడ్ ఇప్పించే సంగతిని ఆ మంచి ఆఫీసర్ మర్చిపోలేదు.

పుల్లారావు మాత్రం ఇతర పుల్లారావులతో ఈ రోజున కూడా జైల్లోనే ఉన్నాడు.